LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

Visit Internet Edition @ www.zaminryot.com "e-mail : editor@zaminryot.com"

# జమీన్‌రైతు

DR UTTHAMA ★★★ HOTEL

ఈద్ ముబారక్

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు

మీ డి.ఆర్.ఉత్తమ ★ ★ ★ హోటల్

ఈద్ శుభాకాంక్షలతో... మీకందిస్తున్న

హైదరాబాదుకు చెందిన ప్రఖ్యాత వంట నిపుణులచే తయారు చేయబడిన హలీమ్, రకరకాల

హైదరాబాదీ బిరియానీలు డబుల్ కా మీఠా, స్పెషల్ షీర్ కుర్మా, ఇంకా ఎన్నో రకాలతో

రూ. 123/- లకే పసందైన విందు భోజనం

నవంబరు 30, 2002 శనివారం సాయంకాలం 7.00 గంటల నుండి

గమనిక:- 8 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తిగా ఉచితం.

Phones : 2317777 - 10 Lines

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు | సంపుటి : 73 | సంచిక : 48 | 29.11.2002 శుక్రవారం | 14 పేజీలు | విడిప్రతి : రూ.3.00లు | జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

### నాలుగు నెలల క్రితం విజిలెన్స్ శాఖ స్వాధీనం చేసుకొంటే కలెక్టర్ గారు ఎందుకు చర్య తీసుకోలేదు?

# సర్వేపల్లి బియ్యం దొంగలెవరు?

– పనికి ఆహార పథకం అవినీతికి ఎల్లలు లేవని మరొకసారి స్పష్టంగా రుజువైంది. ఎల్ల లేనిది ఒక్క తినే పరిమాణంలోనే కాదు, తినేవారి రాజకీయ అనుబంధాలలో కూడా!

నెల్లూరు దక్షిణ శివారులోని కాకుటూరు ఎఫ్‌సిఐ గోడౌన్లలో పెద్ద ఎత్తున అక్రమ బియ్యం నిల్వ లున్నాయని ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి ఎవరో పోటిడి అందించారు. ఆ .మాట చెవిన పడిన వెంటనే మందీ మార్బలంతో గోడౌన్‌లో వాలిపోయారాయన. 30లక్షల రూపాయల విలువ చేసే 5947బస్తాల బియ్యం అక్కడ ప్రత్యక్షమైంది.

ఈ బియ్యానికి పెద్ద చరిత్రే వుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో పనికి ఆహారం పథకం క్రింద కూలీలకు పంపిణీ కావలసిన బియ్యం ఇవి. మామూలు పద్ధతిలో కాంట్రాక్టర్ల చేతుల మీదుగా బియ్యం వ్యాపారులపరమైనాయి. ఇది జరిగింది జూన్, జూలై నెలల్లో! అప్పట్లో కాంట్రాక్టర్‌కు కట్టిన బియ్యం వెల కేవలం రు5.30లు; ఎఫ్‌సిఐ లెవీ ధర అంతకంటే అధికం కావడంతో ఆ వ్యాపారులు వాటిని నేరుగా ఎఫ్‌సిఐకి తరలించారు. నెల్లూరులో అయితే విషయం బయట పడుతుందని రేణిగుంట ఎఫ్‌సిఐ డిపోకు రవాణా చేశారు. కాని అక్కడి అధికారులకు ఆ బియ్యం చూడగానే అనుమానం వచ్చేసింది. ఇవి రైతుల నుంచి తెచ్చినవి కావన్న సంగతి అర్థమైంది. పనికి ఆహార పథకం కింద తాము పంపిణీ చేసిన పాత బియ్యం తిరిగి తమకే చేరాయని నిర్ధారించుకొని, హైదరాబాద్‌లోని ఎఫ్‌సిఐ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించారు. వారు వెంటనే విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. పోలీసులు దాడిచేసి లారీలన్నింటినీ సీజ్ చేశారు. విజిలెన్స్ రెయిడ్ వార్త బయటపడగానే ఆరు లారీల డ్రైవర్లు తప్పించుకొని పారి పోయారట. 47లారీలు పట్టుబడ్డాయి. ఇవన్నీ నెల్లూరుజిల్లా బియ్యం బస్తాలు కావడంతో, విచారణ కోసం నెల్లూరుకే తరలించి, కాకుటూరు గోడౌన్‌లో నిల్వ చేశారు. అప్పుడే ఈ సమాచారం జిల్లా కలెక్టర్‌కు అందించారు.

ఏ స్థాయిలో నుంచి ఎంత తీవ్రమైన వత్తిడి వచ్చిందో తెలియదు కాని - బియ్యం నెల్లూరు చేరగానే విజిలెన్స్ కేసు మాఫీ అయిపోయింది, చాలా తెలివిగా - ఈ బియ్యం పనికి ఆహార పథకానికి చెందినవో, కావో తెలుపమని లేబరెటరీకి శాంపిల్స్ పంపారు. మామూలు బియ్యానికి, పథకం బియ్యానికి రంగు, రూపు, రుచి. వాసన వంటి వాటిలో ఎటువంటి తేడా వుండదనే సంగతి అందరికి తెలుసు. అయినా, రెండింటి మధ్యన ఏదో పెద్ద వ్యత్యాసం వున్నట్లు నటించి, పరీక్షకు పంపారు. లేబరెటరీ నుంచి అనుకున్నట్లే- ఇవి పథకం బియ్యం కావు అన్న నివేదిక వచ్చింది. ఆ కాగితం ముక్కను కుంటి సాకుగా చూపించి కేసు మూసేశారు.

విజిలెన్స్ కేసు క్లోజ్ అయినా ఎఫ్‌సిఐ మాత్రం ఆ బియ్యాన్ని తీసుకోవడానికి నిరాకరించింది. దానితో కొందరు వ్యాపారులు దాదాపు 26లారీల సరకు వెనక్కు తీసుకపోయారు. లెవీ ప్రమాణాలకు సరిపడా నాణ్యత లేని బియ్యం కాబట్టి వెనక్కు ఇచ్చేస్తున్నామని ఎఫ్‌సిఐ వారు తమ ఫైల్‌లో వ్రాసుకొని చేతులు దులుపుకున్నారు. అంత మాత్రం పలుకుబడిలేని వ్యాపారులకు చెందిన 21 లారీల సరకు గోడౌన్‌లో నిల్చిపోయింది. ఇప్పుడు వివేకానందరెడ్డికి దొరికిన బియ్యం అవే!

వీటికి కూడా వారం రోజుల క్రితం రిలీజ్ ఉత్తర్వు వచ్చిందట. ఒకటి రెండు రోజులలో వెనక్కు తిప్పి పంపడానికి ఏర్పాట్లు జరిగాయట. ఈలోగా ఇంత పెద్ద వివాదం చెలరేగడంతో అందరూ ఇరుక్కుపోయారు.

వీటిని విజిలెన్స్ శాఖ 7రైస్ మిల్లుల నుంచి స్వాధీనం చేసుకొన్నది. ఆ మొత్తాలు ఇవీ. రాజరాజేశ్వరి, ముత్తుకూరు- 1666బస్తాలు; ధనలక్ష్మి, పడుగుపాడు- 500 ; శివకామాక్షి, పెద్దచెరుకూరు- 433; ఎస్‌వి రైస్‌మిల్స్, కోడూరుపాడు- 667; పి.వి. సురేష్‌బాబు, ముత్తుకూరు- 250; సాయిబాబా, నెల్లూరు- 250; మారుతి రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్, నవాబుపేట- 840 బస్తాలు!

వీటిని వివేకానందరెడ్డి పట్టుకొన్నట్లు తెలియగానే కలెక్టర్ గారు హడావుడిగా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి, అతకని అబద్ధాలు చెప్పారు. ఏదో ఒక రకంగా వివాదాన్ని ప్రక్కదారి పట్టించాలన్న

తరువాయి 6వ పేజీలో

### పనికి ఆహారం స్వాహాలో తాజా ఉదంతం

- ★ ఎఫ్‌సిఐ గోడౌన్‌లో దాచిన బియ్యం వెలికి తీసిన ఎమ్మెల్యే వివేకానందరెడ్డి
- ★ ఎక్కడో ఒరిస్సాలో పండే టి-47 రకాన్ని నెల్లూరు మిల్లులు తోలడమే గోల్మాల్‌కు నిర్ధారణ కాదా?
- ★ డిసిసి అధ్యక్షుడి అనుచరులవన్న మంత్రి ఆరోపణ నిజమైతే, వారికా బియ్యం ఎవరిచ్చారు?
- ★ రాజకీయ నిందాక్రీడలో నేరస్తులు తప్పించుకు పోతున్నారు!



# దొంగలెవరు

తాపత్రయం కన్పించింది ఆయనలో! అయితే ఐఎఎస్ ట్రైనింగ్‌లో అసత్య ప్రలాపాల అధ్యాయమేదీ వుండదు కదా? నేర్వని విద్యలో ప్రావీణ్యం ఎట్లా వస్తుంది పాపం? ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ ప్రహసనం ఆయన స్వయం నిర్ణయమని భావించలేము. పై నుంచి పెద్ద ఎత్తున వత్తిడి వచ్చి వుండాలి. పై నుంచి ప్రాణం తోడేసేవారెవరో ప్రత్యక్షంగా చెప్పపని లేదు కదా? ఆ పుణ్యం కట్టుకున్నది జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అయివుంటాడు.

ఆయనకు ఆతురత కల్గడంలో ఆశ్చర్యమేదీ లేదు. దొరికిన బియ్యంలో అధిక భాగం సర్వేపల్లి నియోజకవర్గానివి. ఆ బియ్యం ఎఫ్‌సిఐకి తోలిన రైస్ మిల్లులన్నీ ఆయన ప్రాంతంలోనివే. అందుకే అంత భయం.

అయితే ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా, ఎవరెంత తాపత్రయపడినా ఈ బియ్యం పనికి ఆహార పథకం స్వాహాకు సంబంధించినవి కావు అని నిరూపించలేరనడం నిజం. ఇవి ముమ్మాటికీ గోల్మాల్ సరుకే! అయితే చేప వచ్చి గాలానికి చిక్కినట్లు బియ్యం దొంగలు నేరుగా విజిలెన్స్ వలలో పడినా, ఆ విషయం గోప్యంగా వుంచి, నాలుగు నెలలు కాలయాపన చేసి, వీలైనప్పుడల్లా వీలైనంత బియ్యం వదలి పెట్టడానికి కారణం ఏమిటన్నది ప్రశ్న.

కలెక్టరు, లేదా మంత్రి లేదా ఇతర ప్రభుత్వాధికారెవరికైనా చిత్త శుద్ధి వుండివుంటే నాలుగు నెలల క్రితం బియ్యం దొరికినప్పుడే వాటిని తెచ్చిన రైస్ మిల్లులపై చర్య తీసుకొని వుండాలి. కాని అది జరగలేదంటే ఈ బియ్యం దొంగతనంతో వీరికి ప్రమేయం వుండాలి లేదా బియ్యం దొంగలతో సంబంధం వుండాలి. బియ్యం చోరీ ఒక దశలో జరగదు. ఏదో ఒక పని కాగితాలపై సృష్టించిన ఇంజనీర్లు, దాని మంజూరుకు సిఫార్సు చేసిన నేతలు, ఆ పని తీసుకున్న కాంట్రాక్టర్లు, అతడికి సరఫరా చేసిన చౌక డిపో డీలరు, వాటిని కొన్న వ్యాపారి, ఆ వ్యాపారికి తమ పేరు మీద లెవీ తోలడానికి బిల్లు వ్రాసిచ్చిన రైసు మిల్లు, వారికి లెవీ పర్మిట్ జారీ చేసిన సివిల్ సప్లయిస్ ఉద్యోగులు - వీరందరూ చోరీలో భాగస్తులే!

దొరికిన బియ్యం టి-47 అనే రకం; ఇది నెల్లూరు జిల్లాలోనే కాదు, ఆంధ్రలో ఎక్కడా పండదు. ఒరిస్సా ప్రాంతం పైరు. పైగా వీరు తోలినవి పాత బియ్యం, కనీసం ఏడాది పాటు మగ్గినవి. దీని అర్థం - ఎఫ్‌సిఐ నుంచి పథకం కోసం విడుదలైనవే తిరిగి ఎఫ్‌సిఐకి చేరాయని! ఇంత పబ్లిగ్గా అర్థమయ్యే విషయాన్ని మసిపూసి మారేడు కాయ చేయచూడడం వృథా ప్రయాస!

సర్వేపల్లి నియోజకవర్గం కాబట్టి తనను బియ్యం దొంగ అంటారని భయపడి భుజాలు తడుముకొంటున్నారు మంత్రి. తనపైన పడిన బురదను తన ప్రత్యర్థి, డిసిసి అధ్యక్షుడు సి.వి.శేషారెడ్డి మీదకు విసిరేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ బియ్యం తోలిన రైస్ మిల్లుల్లో నెల్లూరుకు చెందిన మారుతి, ముత్తుకూరుకు చెందిన రాజరాజేశ్వరి మిల్లులు సి.వి.శేషారెడ్డి ముఖ్య అనుచరు

మొదటి పేజీ తరువాయి

లవని; బియ్యం చోరీ ఆయన చేతుల మీదుగా జరిగిందని - మంత్రి వాదన. అదే నిజమైతే, ఇది వరకే గోడౌన్ నుంచి తరలించిన బియ్యం సరఫరాదారులు మంత్రి అనుచరులనే కదా అర్థం.

సి.వి.శేషారెడ్డి అనుచరులకు అసలు పథకం బియ్యం ఎట్లా దొరికాయి; ఎవరు ఇచ్చారు? కాంట్రాక్టర్లందరూ తెలుగునేతలైనప్పుడు కాంగ్రెస్ నేతకు బియ్యం ఎవరిచ్చారు? ఈ ఆరోపణే నిజమైతే - ఈ వార్త మొదట్లో వ్యాఖ్యానించినట్లు గోల్మాల్‌కు రాజకీయ ఎల్లలు చెరిగిపోయి వుండాలి. అంతటి రాజకీయ దిగజారుడు తనం నమ్మశక్యమా? ఎందువల్లనో సి.వి.శేషారెడ్డి గారు మాత్రం ఈ బియ్యం తెలుగు దొంగలవి అని ప్రత్యారోపణ చేయడం లేదు. దీని భావమేమి తిరుమలేశా?

మరొక ప్రక్క రైస్ మిల్లుల యజమానులు మాత్రం ఇవి తమ బియ్యం కానేకావని; ఎవరో తమ పేరిట ఎఫ్‌సిఐకి తోలారని; వాటిని వారు ఏమి చేసుకున్నా తమకు సంబంధం లేదని చెప్తున్నారు. ఇది మరీ నేరపూర్వకమైన వాదన. వారు చెప్పేది నిజమే అయితే మాత్రం చోరీతో పాటు, ఫోర్జరీ కేసు కూడా పెట్టాలి.

ఈ వివాదంలో వాస్తవాలు బయటపడాలంటే, ఎఫ్‌సిఐలో పేర్లున్న రైస్ మిల్ యజమానులందరినీ అరెస్ట్ చేసి, విచారణ జరిపించాలి. వారికా బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయో, ఎవరు అమ్మారో తెలుసుకోగల్గితే నిజానిజాలు తేలిపోతాయి. అయితే ఆ కోణంలో నిర్ణయం తీసుకోవడానికి మంత్రి, కలెక్టర్లిరువురూ సిద్ధంగా లేరు. ప్రెస్ కాన్ఫరెన్స్ ప్రహసనాలు తప్ప. దర్యాప్తు, కేసు అంటే - కడుపు చించుకుంటే కాళ్ల మీద పడినట్లు తమ జాతకాలు వెల్లడౌతాయని వారి భయం.

ఎమ్మెల్యే వివేకానందరెడ్డి మాత్రం దీన్ని తేలికగా వదలి పెట్టేట్లు లేరు. మంత్రిని సతాయించడానికి దొరకక దొరకక దొరికిన అవకాశాన్ని జారవిడుచుకోరు కదా? వీరి రాజకీయ క్రీడలో నేరస్తులు హాయిగా పూపిరి పీల్చుకొంటున్నారు.

## మూడింది

5వ పేజీ తరువాయి

ఎరువుల దుకాణానికి లైసెన్స్ పొందాడు. గత రెండు సంవత్సరాల క్రిందట మురళీకృష్ణ ఏజెన్సీ ఎరువుల వ్యాపారానికి స్వస్తి పలికిన నేపథ్యంలో ఆ వ్యాపారంలో అనుభవమున్న రంగారావు తన పేరున దేకూరుపల్లిలో ఉన్న లైసెన్స్ ఉపయోగించి అసలు ఎరువుల ముసుగులో నకిలీ ఎరువులు చేరవేసి సొమ్ము చేసుకొన్నాడనే ఆరోపణలు ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి. ఉదయగిరిలో ఇద్దరు ప్రధాన ఎరువుల వ్యాపారులను ఈ నకిలీ ఎరువుల వ్యాపారి రంగారావు ప్రధానంగా ఎంచుకొని పూర్తిస్థాయిలో నకిలీ ఎరువులు సరఫరాచేసి భారీగా సొమ్ము చేసుకొన్నట్లు తెలిసింది. నకిలీ ఎరువుల విషయం తెలిసినా లంచాలు మెక్కిన వ్యవసాయాధికార్లు జరుగుతున్న వ్యవహారాన్ని చూస్తూ మిన్నకుండిపోయారు. దీంతో రంగారావు నకిలీ ఎరువుల వ్యాపారం మూడు నకిలీ యూరియా బస్తాలు, ఆరవై డిఎపి బస్తాలుగా సాగిపోయింది. ఒక్కసారిగా జిల్లారంలోని నకిలీ ఎరువుల భాగోతం బయట పడటంతో ఉదయగిరి ప్రాంతంలోని నకిలీ గోతాలలో నింపిన ఎరువుల గోడౌన్లు ఖాళీ చేసినట్లు తెలుస్తోంది. ఉదయగిరి ప్రాంతంలో ఉదయగిరి, సీతారాంపురం, మర్రిపాడులకు ఈ నకిలీ ఎరువులు సరఫరా అయినట్లు ఆరోపణలు రోజురోజుకు బలపడుతున్నాయి. స్థానిక వ్యవసాయాధికార్లకు తెలియకుండా ఇదంతా జరుగుతుందంటే నమ్మశక్యంగా లేదు. సత్వరమే అధికార్లు జోక్యం చేసుకొని గతంలో జరిగిన వ్యాపార లావాదేవీలపై విచారిస్తే అన్నీ విషయాలు బయటపడతాయి.




# శ్రద్ధాంజలి

మానవతా విలువలకు మరో రూపం
నీతి, నిజాయితీలకు ప్రతి రూపం
దయ, ధర్మాలకు అంకితం
సుబ్బరామన్న జీవితం



జననం
26.11.1947

మరణం
1.12.1995

## కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు

ఒంగోలు పార్లమెంటు మాజీ సభ్యులు

## ఏడవ వర్ధంతి

సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

**కుటుంబసభ్యులు మరియు అభిమానులు**

1.12.2002 తేది ఆదివారం ఉదయం 11 గంటల నుండి నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణ మండపము నందు అన్నదాన కార్యక్రమము జరుగును.